
ప్రశాంతంగా నిమజ్జనోత్సవం

- జనసంద్రంగా మారిన ట్యాంక్ బండ్
- సందర్శకుల నినాదాలతో హోరెత్తిన పరిసరాలు
- ప్రశాంతంగా గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ బడాగణేశ్
- మంత్రి పొన్నం,అధికారులు ఏరియల్ సర్వే...సిసిసి నుంచి డిజిపి పర్యవేక్షణ
- ట్యాంక్‌బండ్‌పై సిఎం సందడి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో గణేశ్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా చేస్తున్న నృత్యాలు.. డ్యాన్స్ స్టెప్పులు, పీకల మోతలు, డప్పుచప్పుళ్లతో.. శంకర్‌కా భేటా.. ఘాడీమే బైటా.. అంటూ ప్రజల నినాదాలతో నగరంలో హోరెత్తిపోయింది. జంటనగరాలతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన వేలాది మంది ప్రజలతో ట్యాంక్‌బండ్ పరిసరాలు కిటకిటలాడాయి. శనివారం వేల సంఖ్యలో విగ్రహాలు హుస్సేన్ సాగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో గణనాథులు గంగమ్మ ఒడికి చేరాయి. పలు రూపాల్లో కొలువైన గణనాథుని విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్రను చూడటానికి జనం భారీగా తరలిరావడంతో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిశాయి. నిమజ్జన ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సీపీ సివి.ఆనంద్ హెలికాప్టర్‌లో ఏరియల్ వ్యూ ద్వారా పర్యవేక్షించారు. ట్యాంక్‌బండ్‌పై సీఎం రేవంత్ రెడ్డి, విపక్ష నేత కేసీఆర్ పేరుతో ఆలపించిన పాటలు హోరెత్తించాయి. దాంతో సందర్శకులు, రాజకీయ నాయకులు సైతం నృత్యాలు చేశారు. ఆదివారం ఉదయం వరకూ నిమజ్జన ప్రక్రియ కొనసాగనుంది. అయితే, డీజేలకు అనుమతిలేదంటూ పోలీసులు చెప్పినా.. గుండెలు అదిరే మైక్ సౌండ్స్ ఆగలేదు.

ఆకస్మికంగా ట్యాంక్‌బండ్‌కు సీఎం

వినాయక నిమజ్జనం నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా ట్యాంక్‌బండ్‌కు వచ్చి గణేష్ నిమజ్జనాలను పరిశీలించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వయంగా సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకుని భద్రతా ఏర్పాటను పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నేరుగా జనాన్ని అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సాధారణ వ్యక్తిగా వచ్చిన సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే భద్రతా చర్యలను పటిష్టం చేశారు. ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం ముందుకు కదిలారు. అత్యంత తక్కువ సంఖ్యలో భద్రత సిబ్బందితో మూడు కార్ల ఎస్కార్ట్‌తో సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. విగ్రహాల నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు. ఉత్సవ సమితి వేదికపైకి ఎక్కి గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు.

భారీ బందోబస్తు.. ఆకట్టుకున్న అశ్వదళం

నగరంలో దాదాపు 50వేలకుపైగా విగ్రహాలు నిమజ్జనం అవుతాయని అంచనా వేసిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలో 94 నిమజ్జన కేంద్రాలుండగా, అదనంగా మరో 20చోట్ల ఏర్పాట్లు చేశారు. నగర వ్యాప్తంగా 303 కిలోమీటర మేర కొనసాగిన శోభాయాత్రలో 35వేల మందికిపైగా పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తును ఉపయోగించారు. దాదాపు 1000 సీసీ టీవీ కెమెరాలతో పోలీసులు కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించారు. 200 మందికిపైగా ఐటీ సెల్ సిబ్బంది సామాజిక మాధ్యమాల్లో పోస్టులను పరిశీలించారు. ప్రత్యేకంగా ఈసారీ శోభాయాత్రలో మహిళల చేత అశ్వదళాన్ని రంగంలోకి దించారు. అశ్వదళం (మౌంటెడ్), జాగిల (డాగ్‌స్క్వాడ్) బృందాల్లో మహిళలు నాయకత్వం వహించారు. నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ట్రాఫిక్ మళ్లింపు చేశారు. భారీ విగ్రహాలను ట్యాంక్‌బండ్ వైపు, మీడియం, చిన్నసైజు విగ్రహాలను ఎన్టీఆర్ మార్గ్ వైపు తరలించారు.

ప్రశాంతంగా ఖైరతాబాద్ విశ్వమహాగణపతి నిమజ్జనం

ఖైరతాబాద్ 69 అడుగుల మహాగణేశ్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. శోభాయాత్ర, నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు మొదలైన శోభాయాత్ర రాజ్‌ధూత్ హోటల్, టెలిఫోన్ భవన్, సెక్రటేరియేట్ మీదుగా 12 గంటలకు ట్యాంక్ బండ్‌కు చేరుకుంది. 1:30 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నెంబర్ (బాహుబలి క్రేయిన్) క్రేయిన్ సహాయంతో నిమజ్జనం చేశారు. క్రేన్ నెం.12 వద్ద బాలాపూర్ గణపతిని నిమజ్జనం చేశారు. ఆదివారం ఉదయం వరకు నిమజ్జనం ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు.



మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెరుపల్లి

సామాజిక న్యాయం కోసం పోరాడాలి

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు
- ఎస్‌వికెలో బైరు మల్లయ్య 5వ వర్ధంతి సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సమానత్వం సాధించడమే సామాజిక న్యాయమని, అందుకోసం పోరాడాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బైరు మల్లయ్య 5వ వర్ధంతి సభ శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. మల్లయ్యతో తనకెంతో అనుబంధం ఉందని, ఆయన కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పరితపించే వారన్నారు. గ్రామాలకు వెళ్లి వారిని చైతన్యపరచడంలో ఎంతో కృచేశారన్నారు. కష్టజీవుల తరపున నిలబడి దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. 79 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఇంకా ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లౌకిక, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడటమే మల్లయ్య ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. టిపిఎస్‌కవి రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని కోరారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గీత కార్మికులకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని, వృత్తి చేసే వారందరికీ సేఫ్టీ కిట్టులు ఇవ్వాలని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారందరికీ పెన్షన్ అమలు చేయాలని, నందనములోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు.

సిపిఎం సీనియర్ నాయకులు నర్రా రమేశ్ మృతి

- తమ్మినేని, పోతినేని, నున్నా సహా నేతలు, కార్యకర్తల సంతాపం.. నివాళులు
- కమ్యూనిస్టు ఉద్యమం చిగురించే రోజుల్లో రమేశ్ చనిపోవడం దురదృష్టకరం
- సంతాప సభలో తమ్మినేని..



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం మాజీ కౌన్సిలర్, సిపిఎం జిల్లా నాయకులు నర్రా రమేశ్ (58) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో ఓ ఆస్పత్రిలో మృతిచెందారు. రమేశ్ మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. తమ్మినేనితోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు ఎర్రజెండా కప్పి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రమేశ్ మృతదేహాన్ని బురహాన్‌పురంలోని ఆయన స్వగృహానికి తరలించారు. అక్కడి నుంచి అంతిమయాత్ర ప్రకాశ్‌నగర్‌లోని వైకుంఠదామం వరకు సాగింది. అక్కడ అంత్యక్రియలు పూర్తి చేశారు. నర్రా రమేశ్‌కు భార్య నాగలక్ష్మి, కుమార్తె లోహిత, కుమారుడు లిఖిత్ ఉన్నారు. ఆయన సతీమణి నాగలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు.


అంతకుముందు సిపిఎం కార్యాలయంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభలో తమ్మినేని మాట్లాడారు. ప్రపంచంలోనే కమ్యూనిస్టు ఉద్యమం, సిద్ధాంతాల బలం బలహీనపడిన పరిస్థితుల్లో ఉద్యమాన్ని అంటిపెట్టుకోవటం అనేది గొప్ప కమ్యూనిస్టు లక్షణం.. అటువంటి లక్షణమున్న నాయకుడు నర్రా రమేశ్ అని చెప్పారు. పెట్టుబడిదారీ సమాజానికి చివరి ఆశలు కొన్ని ఉన్నాయని తెలిపారు. మళ్లీ కమ్యూనిస్టు ఉద్యమం చిగురించే రోజుల్లో రమేశ్ చనిపోవటం దురదృష్టకరమన్నారు. జాతీయోద్యమం గురించి గొప్పగా పాఠం చెప్పేవారని, జాతీయోద్యమం అంటే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమని వివరించారని గుర్తు చేశారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీల తరపున హృదయపూర్వక నివాళులర్పించారు.

నర్రా రమేశ్‌లో గొప్ప కమ్యూనిస్టు లక్షణాలు

నర్రా రమేశ్ మరణం చాలా బాధాకరమని, అతని శక్తిసామర్థ్యాలు ప్రత్యేకమైనవని సంతాప సభలో తమ్మినేని తెలిపారు. నిర్మాణ సామర్థ్యం, దక్షత, సైద్ధాంతిక స్పష్టత ఉన్న కామ్రేడన్నారు. 58 ఏండ్ల జీవితంలో సుమారు 40-45 ఏండ్లపాటు అదే ఆశయానికి కట్టుబడి ఉండటం, వేరే స్వార్థం లేకుండా ఉండటం...అనారోగ్యంలోనూ పార్టీ గురించి ఆలోచించటం నర్రా రమేశ్‌లో ఉన్న ఉత్తమ కమ్యూనిస్టు లక్షణమని తెలిపారు. కుటుంబం ఇబ్బందులపాలైనా పార్టీ ఇబ్బందుల పాలుకాకూడదు అనే ఆలోచన చేసిన వారే గొప్ప కమ్యూనిస్టన్నారు. విద్యార్థి, యువజన ఉద్యమంలో నర్రా రమేశ్ కీలకంగా వ్యవహరించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. పేదల ఇండ్ల స్థలాలు, మంచినీటి సమస్యపై కౌన్సిలర్‌గా రమేశ్ గళమెత్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఈ సంతాపసభలో కార్పొరేటర్లు యర్రా గోపీ, యల్లంపల్లి వెంకట్రావ్, బి.వెంకట్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజె రమేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, పి.రాజారావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు పి.సోమయ్య, ఎం.సుబ్బారావు, దేవేంద్ర, పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు శింగు నర్సింహారావు, ప్రముఖ రచయిత మువ్వా శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు సీవై పుల్లయ్య, అశోక్, డాక్టర్ చీకటి భారవి తదితరులు పాల్గొన్నారు.

చైనాకు వెళ్లి ఎర్రజెండాకు నమస్కరించిన మోడీ

కమ్యూనిస్టు, సోషలిస్టు వ్యతిరేకి, మతోన్మాది, అమెరికాకు వంగి వంగి దండం పెట్టిన ప్రధాని మోడీ ఇప్పుడు చైనా వెళ్లి ఎర్రజెండాకు నమస్కరించే పరిస్థితులు వచ్చాయని తమ్మినేని అన్నారు. మనమంతా కలిసి అమెరికాను ఎదుర్కోవాలని చైనా అధ్యక్షులు జిన్‌పింగ్, రష్యా ప్రధాని పుతిన్‌తో కలిసి ఫ్రంట్ ఏర్పాటుకు సిద్ధపడటమే కమ్యూనిస్టు ఉద్యమానికి మంచిరోజులు వచ్చాయనేందుకు నిదర్శనమన్నారు.



మానవ సేవతోనే సమాజ వికాసం

- ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఒక్కరూ 'మానవ సేవే - మాధవ సేవ' అనే భావనతో ముందుకొచ్చి తోటివారికి సాయం చేస్తేనే సమాజం పురోగమిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం బాచుపల్లిలో 'కామరాజు అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాలేజ్ ఫీ రెన్యూవల్స్ ప్రోగ్రామ్ ఫర్ ది అకడమిక్ ఇయర్ 2025-26 %డ% ఇంటరాక్ట్ విత్ స్టూడెంట్స్' కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'జనాభాకు అనుగుణంగా ప్రజల అవసరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో కేవలం ప్రభుత్వాలు మాత్రమే కషి చేస్తే సరిపోదు. సమాజంలోని అన్ని వర్గాలు అభివద్ధి చెందాలంటే సామాజిక బాధ్యతతో కూడిన ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. ముఖ్యంగా కామరాజు అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ లాంటి స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం. ఎంతో మందికి స్ఫూర్తిదాయకం' అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'సమాజం మనకేమిచ్చిందన్నది కాదు, మనమేమిచ్చామన్నది ముఖ్యం. అన్నదానంతో పాటు విద్యాదానం చాలా ముఖ్యం. విద్య అనేది కేవలం ఒక డిగ్రీ కాదు, అది ఒక వ్యక్తి భవిష్యత్తును మార్చే శక్తి. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మంది పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తుండటం నిజంగా ప్రశంసనీయం. అందరికీ ఆదర్శనీయం' అని కొనియాడారు. 'సామాజిక సేవ అంటే కేవలం డబ్బులు ఖర్చు చేయడం మాత్రమే కాదు. ఒక చిరునవ్వు, మంచి మాట, చిన్న సహాయం కూడా సేవే. ఇప్పుడు మనం చేసే మంచి పనులు మనతోనే ఆగిపోవు. అవి మన పిల్లలకు, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తాయి' అని వివరించారు. 'మీకు ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకోండి. అందుకు అనుగుణంగా ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోండి.

ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి... గొప్ప విజయాలు అంత సులభంగా రావు. ఓపిక, పట్టుదల, నిరంతర కషి అవసరం. ఎన్ని అడ్డంకులొచ్చినా లక్ష్య సాధనలో ధైర్యంగా ముందుకు సాగండి. తప్పకుండా విజయం సాధిస్తారు' అని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కామరాజు అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ప్రణీత్ గ్రూప్ సీఎండీ నరేంద్ర కుమార్ కామరాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహా రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్, మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు కార్ల్‌బర్గ్ గ్రూప్ విస్తరణ

హైదరాబాద్ : గ్లోబల్ బ్రేవరీస్ కంపెనీ కార్ల్‌బర్గ్ గ్రూపు తన ఐటి గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను గూర్‌గావ్‌లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఇది డిజిటల్ రూపాంతరం, గ్లోబల్ ఐటి సేవలకు కీలక కేంద్రంగా నిలుస్తుందని ఆ కంపెనీ పేర్కొంది. దీన్ని జిఎస్‌పిఎఎన్‌ఎన్ భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చినట్లు కార్ల్‌బర్గ్ గ్రూపు సిఐఒ ఇస్తేర్ వూ తెలిపారు. ఈ సెంటర్ తమ ఐటి బలాన్ని పెంచి, డిజిటల్ రూపాంతరాన్ని వేగవంతం చేయనుందన్నారు. ఆ కంపెనీ సిటిఒ అనురాగ్ పాండే మాట్లాడుతూ.. ఈ సెంటర్ ఐటీ వ్యవస్థను ఏకీకృతం చేసి, చురుకైన సాంకేతిక ప్రక్రియలను రూపొందిస్తుందన్నారు.

విఎల్‌సిసి ఉత్పత్తులపై 50 శాతం తగ్గింపు

హైదరాబాద్ : ప్రముఖ బ్యూటీ అండ్ వెల్‌నెస్ బ్రాండ్ విఎల్‌సిసి కొత్తగా 'ది ఇయర్ గ్రేట్ ఇండియన్ బ్యూటీ ఫెస్టివల్ 2025'ను ప్రారంభించినట్లు తెలిపింది. ఇందులో తమ ఉత్పత్తులపై 50 శాతం వరకు తగ్గింపును అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఫెస్టివల్‌లో విఎల్‌సిసి క్లినిక్‌లలో అడ్వాన్స్‌డ్ స్కిన్ కేర్, ఫేషియల్స్, యాంటీ ఏజింగ్ ట్రీట్‌మెంట్స్, లేజర్ హెయిర్ రిడక్షన్, మేకోవర్ ప్యాకేజీలపై 50 శాతం వరకు తగ్గింపు ఉంటుందని వెల్లడించింది.

అసమానతలు పెంచుతున్న బిజెపి

- అన్యాయాన్ని ఎదిరిస్తే అర్బన్ నక్సలైట్ అంటున్నారు
- రాజ్యాంగ విలువలను పరిరక్షించాలంటే జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొ.హరగోపాల్


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో నిరుద్యోగం, అసమానతలు పెరుగుతున్నాయని, కార్పొరేట్లకు దేశాన్ని దోచిపెట్టేందుకు బిజెపి ఎన్నో కుటిల ప్రయత్నాలు చేస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో 'రాజ్యాంగ విలువలు-పరిరక్షణ' అంశంపై తెలంగాణ పౌర సమాజం ఆధ్వర్యంలో జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలను పరిరక్షించాలంటే జస్టిస్(రిటైర్డ్) సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకునేందుకు ఎంపీలు కృషి చేయాలన్నారు. రాజ్యాంగంపై పూర్తిస్థాయిలో పట్టు ఉన్న సుదర్శన్‌రెడ్డిని దేశ ఉప రాష్ట్రపతిగా ఎన్నుకుంటేనే రాజ్యాంగాన్ని రక్షించిన వాళ్లం అవుతామని వివరించారు. మనిషికి నైతిక విలువలు అనేవి ఎంతో ముఖ్యమని, ఆ విలువలు లేనప్పుడు బతకడం కూడా దండగేనని అన్నారు. రాజ్యాంగాన్ని అనేక పర్యాయాలు ఆర్‌ఎస్‌ఎస్ తిరస్కరించిందే తప్ప ఏనాడూ స్వాగతించలేదని గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనా విధానం ఎంతో ప్రమాదకరంగా ఉంటుందని, అలాంటి కోవకు చెందిన వ్యక్తినే కేంద్ర ప్రభుత్వం ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబెట్టిందని తెలిపారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మావోయిస్టులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అన్యాయాన్ని ఎవరు ఎదిరించినా అర్బన్ నక్సలైట్ అని ముద్ర వేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ ఆడుతున్న నాటకాలను ప్రజలందరూ పసిగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వనమాల, కాంగ్రెస్ ఫరూఖ్ నగర్ మండల అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సీపీఐ నాయకులు బుద్ధుల జంగయ్య, సిపిఎం నాయకులు ఈశ్వర్, శ్రీను నాయక్, టిజి.శ్రీనివాస్, అర్జునప్ప రవీంద్రనాథ్, నర్సింలు గౌడ్, కరుణాకర్, రవి కుమార్, జైపాల్ రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ చౌహాన్, వెంకటరమణ, జనార్ధన్, రామారావు, నక్క బాలరాజ్, రవీంద్రనాథ్, శ్రీధర్‌రెడ్డి, సురేష్, తిరుమలయ్య, శివారెడ్డి, రవి, చంద్రరెడ్డి, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, నరసయ్య, సుశీల పాల్గొన్నారు.



సిఎంను కలిసిన కమాండింగ్ ఇన్ చీఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పూణే సదరన్ కమాండ్‌కు చెందిన కమాండింగ్-ఇన్-చీఫ్, జనరల్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌తో బందం శుక్రవారం హైదరాబాద్ కలిసింది. సిఎంను కలిసినవారిలో దక్షిణ భారత్ ఏరియా జిఒసి మేజర్ జనరల్ ఆర్‌ఎస్ శ్రీనివాస్, జిఒసి టిజి, ఎపి మేజర్ జనరల్ అజయ్ మిశ్రా తదితరులు ఉన్నారు.

కెసిఆర్‌తో ఎమ్మెల్యేల భేటీ

స్థానిక సంస్థలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లిలో గల బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో శనివారం సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని సూచించినట్టు సమాచారం. కవిత విషయం ఎవరూ మాట్లాడొద్దని అధినేత చెప్పినట్టు సమాచారం. ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలు, ఉప ఎన్నికలో అభ్యర్థిగా ఎవరిని నిలబెడతే విజయం సాధిస్తామని చర్చించారని తెలిసింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, చింతాప్రభాకర్, కె.సంజయ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, రవీందర్‌రావు, శంభీపూర్ రాజు, ఎస్సీ, ఎస్టీ, కమిషన్ మాజీ చైర్మెన్ ఎర్రోల్ల శ్రీనివాస్ తదితరులున్నారు.


జాగృతిలో చేరిన బిసి నాయకులను ఆహ్వానించిన కవిత

తెలంగాణ జాగృతిలో బిసి నాయకుల చేరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పలువురు బిసి నాయకులు హైదరాబాద్‌లో ఉన్న బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో చేరారు. శనివారం వారికి కండువాలు కప్పి జాగతిలోకి ఆమె ఆహ్వానించారు. 2001 నుంచి కేసీఆర్ వెంట తెలంగాణ ఉద్యమంలో కలిసి నడిచిన జీహెచ్‌ఎంసీ మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఆరె కటిక సంఘం సురేందర్ తమ అనుచరులతో కలిసి జాగృతిలో చేరారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కల్వకుంట్ల కవిత చేస్తున్న కృషిని గుర్తించే తాము జాగృతిలో చేరుతున్నామని వారు ప్రకటించారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని వారు పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం పలువురు బీసీ సంఘాల నాయకులతో శనివారం రాష్ట్ర కార్యాలయంలో ఆమె సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండానే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ఉందనీ, అదే జరిగితే ఈ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరముందని తెలిపారు. బీసీలను మభ్యపెట్టేందుకు ఇటీవల అసెంబ్లీ, శాసన మండలి సమావేశం ఏర్పాటు చేసి చట్ట సవరణ పేరుతో మళ్లీ మోసపూరిత రాజకీయాలకు తెరతీసిందని విమర్శించారు. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీ నాయకులు, వివిధ కులాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

బాలాపూర్ గణేష్ లడ్డు రూ.35 లక్షలు

- హోరాహోరీగా సాగిన వేలం పాట
- ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నా : లింగాల దశరథ గౌడ్


వేలం పాటలో గెలుచుకున్న లడ్డుతో శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గణేష్ లడ్డు వేలం పాటలో ఈ ఏడాది అనేక మంది పాల్గొన్నారు. హోరా హోరీగా సాగిన వేలం పాటలో హైదరాబాద్ కర్మన్‌ఘట్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, బిజెపి నాయకులు లింగాల దశరథ గౌడ్ రూ. 35 లక్షలకు లడ్డును కైవసం చేసుకున్నారు. 2024లో బాలాపూర్ గ్రామానికి చెందిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్ రెడ్డి రూ.30.01 వేలకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. గతేడాది కంటే ఈ సంవత్సరం లడ్డు రూ.4.99 లక్షలు అధికంగా పలికింది.

రూ. 1016 నుంచి వేలం పాట ప్రారంభం

నవరాత్రి పూజలు అందుకున్న బాలాపూర్ విఘ్నేశ్వరుడికి శనివారం ఉదయం నాలుగు గంటల ఐదు నిమిషాలకు చివరి పూజ చేశారు. ఐదు గంటలకు బాలాపూర్ గ్రామ పురవీధులలో ఆట పాటలు భజన చేస్తూ.. నాట్య బృందాలతో డప్పు వాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించి గ్రామ బొడ్డురాయి వరకు తీసుకొచ్చారు. దాదాపు ఐదు గంటలపాటు ఊరేగింపు కొనసాగింది. బొడ్రాయి వద్ద వంగేటి లక్ష్మారెడ్డి లడ్డు రూ.1016తో వేలం పాటను ప్రారంభించారు. వేలం పాటలో దాదాపు 38 మంది పేర్లు నమోదు చేయించుకున్నారు. అందులో ఎనిమిది మంది ప్రముఖంగా నిలిచారు. చివరకు లింగాల దశరథ గౌడ్ లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరేళ్లుగా లడ్డు కోసం ఎదురుచూస్తున్నానని, ఈసారి దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మెన్ తీగల అనిత రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపిపి సామల రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీచ్ మండ్ విల్లాస్ లడ్డు వేలం

రికార్డు స్థాయిలో రూ.2 కోట్ల 31 లక్షలు పలికిన లడ్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కీర్తి రీచ్ మండ్ విల్లాస్‌లో ప్రతిష్టించిన గణేష్ లడ్డు వేలం పాట చరిత్ర సృష్టించింది. ఏకంగా రూ.2 కోట్ల31 లక్షల ధర పలికింది. ప్రతి ఏడాదీ 10 కిలోల లడ్డును వినాకుడి చేతిలో పెడుతున్నారు. నవరాత్రులు ముగిసిన తరువాత వేలం పాట నిర్వహిస్తారు. అయితే, రీచ్ మండ్ విల్లాస్‌లో అక్కడి వారంతా నాలుగు గ్రూపులుగా విడిపోయి వేలం పాట పాడుతారు. ఎక్కువ మొత్తం పాడిన గ్రూపును వేలంలో గెలిచినట్టు ప్రకటిస్తారు. మిగిలిన గ్రూపుల వాళ్లు పాడిన మొత్తం కూడా వేలంలో కలిపేస్తారు. దాంతో భారీ మొత్తం జమ అవుతుంది. ఆ డబ్బుతో ఆర్‌వి దియా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్య, వైద్యం తదితర అవసరాలకు ఈ డబ్బును ఖర్చు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గతేడాది ఈ లడ్డు రూ.1.87 కోట్లు పలికింది.

నర్రా రమేష్ మరణం బాధాకరం

బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా సిపిఎం సీనియర్ నాయకుడు నర్రా రమేష్ మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి బి వెంకట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న వయస్సులో అనారోగ్యంతో మరణించడం అత్యంత భాధకారమని పేర్కొన్నారు. తాను ఖమ్మం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శిగా ఉన్నప్పుడు ఖమ్మం నగరంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమాల్లో అత్యంత క్రియాశీలకంగా ఆయన పని చేశాడని గుర్తు చేశారు. చిన్ననాటి నుండి విద్యార్థి, ప్రజా ఉద్యమాల్లో కలిసి పని చేశామని తెలిపారు. రమేష్ మరణం పట్ల సంతాపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

- జెఎన్‌టియు సిరిసిల్లలో శాశ్వత భవనాలను నిర్మించాలి : కెటిఆర్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జెఎన్టీయూ సిరిసిల్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్టీయూ వీసీ టి కిషన్‌కుమార్‌రెడ్డితో ఆయన ఫోన్‌లో సంప్రదించారు. జేఎన్టీయూ సిరిసిల్లలో ఇంజినీరింగ్ కాలేజీ కోసం శాశ్వత భవనాల నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతులకు ఆటంకం కలగకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారని తెలిపారు. సిరిసిల్లలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ హయాంలో ప్రారంభించిన జేఎన్టీయూ సిరిసిల్ల ఇంజినీరింగ్ కాలేజీకి అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేములవాడలోని డిగ్రీ కాలేజీలో కొనసాగుతున్న ప్రస్తుత తాత్కాలిక తరగతి గదులకు తాళం వేయడంతో ఇంజినీరింగ్ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన వార్తను ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న తీరుగానే స్థానిక అగ్రహారంలోని డిగ్రీ కాలేజీ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే కాలేజీతో అవసరమైన ఒప్పందం చేసుకుని పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను చెల్లించేలా చూడాలని కోరారు. ఈ అంశంలో సానుకూలంగా స్పందించిన సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించడంతోపాటు తరగతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ప్రభుత్వం 2021లో సిరిసిల్లలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేసిందని తెలిపారు. దీని కోసం రూ.402 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. మొదటి విద్యా సంవత్సరంలో 360 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు 1032 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వివరించారు. వారిలో 700 మందికి హాస్టల్ వసతి కూడా కల్పించారని తెలిపారు. కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు డిగ్రీ కాలేజీలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అయితే, కాలేజీ కమిషనర్ నుంచి తాత్కాలిక వసతి పొడిగింపు ఉత్తర్వులు రానందున, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ తరగతి గదులకు తాళం వేశారని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న అంశాన్ని తెలుసుకున్న కేటీఆర్, సంబంధిత అధికారులతో మాట్లాడారు. జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో టీచింగ్, వసతికి సంబంధించిన ఈ సమస్యను పరిష్కరించడానికి జేఎన్టీయూ అధికారులు జులైలోనే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినప్పటికీ, ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. ఈ అంశంలో తగిన అనుమతులు ఆదేశాలు స్థానిక డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఇవ్వాలని కేటీఆర్ సూచించారు.

డికె శివకుమార్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఇరిగేషన్ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. శనివారం బెంగుళూరులోని డీకే నివాసానికి వెళ్లిన వీరు ఆయనతో సమావేశమయ్యారు. ఈ మేరకు డీకే శివకుమార్ ఎక్స్‌వేదికగా ఉత్తమ్ దంపతుల భేటీ అయిన సమాచారాన్ని పోస్ట్ చేశారు. గంటకు పైగా జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ అలాగే కర్నాటక రాష్ట్రాల తాజా రాజకీయ పరిస్థితులు, రాజకీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, వివిధ అంశాలపై చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది.

20 నుంచి 62వ చెస్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మకమైన 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ లోగోను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ డివివిఎస్ సోమయాజులు, డీఎస్ఎల్ఎల్‌యూ వీసీ డి సూర్యప్రకాశరావు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు అడుసుమిల్లి సురేష్, ప్రధాన సలహాదారు కెవివి శర్మ శనివారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె జగదీశ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలు ఈనెల 20 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరుగుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న గ్రాండ్‌మాస్టర్లు, అంతర్జాతీయ మాస్టర్లు, మహిళా గ్రాండ్ మాస్టర్లు పాల్గొని ప్రతిభను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఏపీ చెస్ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందనీ, ప్రతిభావంతులైన ఆటగాళ్లకు జాతీయ స్థాయిలో పేరు సంపాదించేందుకు గొప్ప అవకాశం కలుగుతుందని వివరించారు.

నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం

- కవిత మాటలు.. ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నా 20 ఏళ్ల రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం లాంటిది. నేనేమిటో.. నా క్యారెక్టర్ ఏంటో ప్రజలకు తెలుసు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాపై చేసిన ఆరోపణలు ఆమె విజ్ఞతకే వదిలేస్తున్న..' అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. లండన్ నుంచి శనివారం హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న హరీశ్‌రావుకు అభిమానులు, పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల హరీశ్‌రావుపై చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై కవిత ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నారో తెలియదని అన్నారు. ఆమె మాట్లాడిన మాటలపై కౌంటర్ ఇవ్వదల్చుకోలేదని, విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. రైతులు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ కేసీఆర్ సీఎంగా రావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ద్రోహుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజల తరపున పోరాడి పార్టీని అధికారంలోకి తెస్తామని చెప్పారు.

మంజీర వంతెనకు వేలాడిన మృతదేహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా సాలూర మండల సమీపంలో మంజీర నదిపై గల పాత వంతెనకు శనివారం ఓ వ్యక్తి మృతదేహం వేలాడుతూ కనిపించింది. అటువైపు వెళ్లిన స్థానికులు చూసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం వెలుగుచూసింది. అయితే, మృతుడు మహారాష్ట్ర కార్లా గ్రామానికి చెందిన మరీబా (65)గా అక్కడకు వచ్చిన వారు గుర్తించారు. మృతుడు బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదని పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని వారు తెలిపారు. ఈ విషయమై బోధన్ రూరల్ పోలీసులను వివరణ కోరగా.. అది మహారాష్ట్ర పోలీసుల పరిధిలో ఉందని తెలిపారు.

క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం... విశ్రాంత ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న విశ్రాంత ఉద్యోగి ప్రసాద్‌బాబు (65) క్రేన్ ఢీకొని మృతి చెందాడు.

రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ గాయత్రి నగర్‌లో శనివారం ఈఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... డ్రైవర్ నిర్లక్ష్యంగా క్రేన్ నడపడంతో నడుచుకుంటూ వెళ్తున్న ప్రసాద్‌బాబు.. వాహనం ముందు టైరు తగిలి కిందపడిపోయాడు. ఆ తర్వాత క్రేన్ అతనిపై నుంచి తొక్కుకుంటూ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న మీర్‌పేట్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

మద్యం వ్యాపారంలో వారిదే హవా

- ప్రతిఏటా 'సిండికేట్' గుప్పిట్లోనే దుకాణాలు
- నవంబర్ నాటికి ముగియనున్న పాత దుకాణాల లైసెన్సు
- 2025-27 నోటిఫికేషన్‌కు సిద్ధమైన సర్కారు
- దరఖాస్తు రుసుం, లాటరీ విధానం.. ప్రభుత్వానికి కాసుల పంట!



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మద్యం వ్యాపారం మరోసారి వేలాది దరఖాస్తులకు, కోట్లాది రూపాయల ఆదాయానికి కేంద్ర బిందువుగా నిలువబోతోంది. మద్యం దుకాణాల గడువు ముగియక ముందే, ప్రభుత్వం కొత్త పాలసీని ప్రకటించి దరఖాస్తుల స్వీకరణకు సిద్ధమైంది. ప్రతి దరఖాస్తుకూ రూ.మూడు లక్షలు, లైసెన్స్ ఫీజులు, టర్నోవర్ ట్యాక్స్ వసూలుకు ఎక్సైజ్ శాఖ వచ్చే ఏడాదికి ఏర్పాట్లు చేసింది. గతంలో రూ.రెండు లక్షలుగా ఉన్న దరఖాస్తు రుసుమును రూ.మూడు లక్షలకు పెంచినా, దరఖాస్తుల సంఖ్య ఏ మాత్రమూ తగ్గలేదు. మద్యం విషయంలో ప్రభుత్వం ఎన్ని చెప్పినా ఈ వ్యాపారంలో సిండికేట్లదే హవా నడుస్తోంది. ముఖ్యంగా లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించడం, ఒకే వ్యక్తికి అనేక దుకాణాలు కేటాయించే అవకాశం ఇవ్వడం సిండికేట్‌ల పట్టును మరింత బిగిస్తోంది. ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్న కొందరి చేతుల్లోనే మళ్లీ షాపులు కేంద్రీకృతం కానున్నాయి.

రాష్ట్రంలో డిసెంబర్ ఒకటి నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది. ఈసారి దరఖాస్తు రుసుము రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచారు. దీంతోపాటు ఒక వ్యక్తికి ఎన్ని దుకాణాలైనా కేటాయించేలా నిబంధనల్లో మార్పులు చేశారు. గతంలో ఒక వ్యక్తికి ఒకే దుకాణం కేటాయించే పద్ధతి ఉండగా, ఇప్పుడు లాటరీలో ఎన్ని దుకాణాలు వస్తే అన్నింటినీ తీసుకోవచ్చు. దీంతో డబ్బున్న పెద్ద వ్యాపారులు, ముఖ్యంగా సిండికేట్‌లు భారీగా దరఖాస్తులు వేసి, ఒకేసారి అనేక దుకాణాలను చేజిక్కించుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

సిండికేట్ల చేతుల్లోనే..!

మద్యం వ్యాపారంలో భారీ లాభాలు వస్తుండటంతో, ఈసారి కొత్తవారు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ముందుకు వస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిస్థితి మరోలా ఉంది. ఇక్కడ దాదాపు 80 శాతం మద్యం దుకాణాలు సిండికేట్‌ల చేతుల్లో ఉన్నాయి. గతంలో ఒక గ్రూపు ఏకంగా వెయ్యి దరఖాస్తులు అందజేసింది. మరికొన్ని గ్రూపులు వందల సంఖ్యలో దరఖాస్తు చేశాయి. గత పాలసీల గణాంకాలు చూస్తే, దరఖాస్తుల సంఖ్య ఏయేటికాయేడు భారీగా పెరుగుతోంది. పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 2021-23తో పోలిస్తే 2023-25లో దరఖాస్తుల సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. ఈసారి దరఖాస్తు రుసుము పెంచినా, సిండికేట్‌లు ఏమాత్రమూ వెనక్కి తగ్గేలా లేరు.

కాసుల పంటగా దరఖాస్తు రుసుం, లాటరీ

మద్యం వ్యాపార నియంత్రణకు పాలసీ తీసుకురాకుండా.. కేవలం ఆదాయం మీదనే దృష్టిసారిస్తున్న ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపు పేరుతో దరఖాస్తు రుసుము, లాటరీ విధానం తీసుకొచ్చి రూ.కోట్లలో ఆదాయం జమ చేసుకుంటోంది. ఇది ఏయేటికాయేడు రెట్టింపు అవుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిశీలిస్తే..

- కరీంనగర్ జిల్లాలో 2021-23లో 94 దుకాణాలకు 1720 దరఖాస్తులురాగా రూ.34.40కోట్లు ఆదాయం వచ్చింది. గతేడాది 4,040 దరఖాస్తులకుగాను రూ.80.80 కోట్ల ఇన్‌కం వచ్చింది.

- జగిత్యాల జిల్లాలో 2021-23లో 71 దుకాణాలకు 1471 దరఖాస్తులకుగాను రూ.29.42కోట్ల ఆదాయం రాగా.. 2023-25లో 2,636 అప్లికేషన్లకు రూ.52.72 కోట్లు వచ్చాయి.

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 48 దుకాణాలకు 2021-23లో 1080 దరఖాస్తులురాగా రూ.21.60 కోట్లు సర్కారుకు ఆదాయం వచ్చింది. 2023-25సంవత్సరానికి ఏకంగా 2,610 దరఖాస్తుల ద్వారా రూ.52.20 కోట్లు వచ్చాయి.

- పెద్దపల్లి జిల్లాలో 77 దుకాణాలకు 1080 దరఖాస్తులకుగాను రూ.21.60కోట్ల ఆదాయంరాగా 2023-25లో ఏకంగా 2,022 దరఖాస్తుల ద్వారా రూ.40.44 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది.

బెల్టు షాపుల విజృంభణ

గ్రామాల్లో మెడికల్ షాపులు ఉన్నాయో లేదో కానీ.. వీధికో బెల్ట్ షాపు వెలిసింది. అధికారిక వైన్‌షాపులు అందుబాటులో లేని వేళ, రాత్రి వేళల్లో వీటిపైనే వినియోగదారులు ఆధారపడుతున్నారు. దీనిని వైన్‌షాపుల యజమానులే ప్రోత్సహిస్తూ బెల్టు షాపుల నిర్వాహకులకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా మద్యం బాటిళ్లను కాటన్ల కొద్దీ అమ్ముతున్నారు. దీని గురించి ఎక్సైజ్ శాఖ వారికి తెలిసినా మామూళ్లకు అలవాటు పడి చూసీచూడనట్టుగా వదిలేస్తున్నట్టు తెలిసింది. మద్యం వ్యాపారులు చెప్పినట్టుగా పోలీసులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దాంతో వారు ఒక్క బీరుపై రూ.పది, మద్యం బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నా చర్యల్లేవ్. ఇది ప్రభుత్వానికి నష్టాన్ని కలిగించడమే కాకుండా, అక్రమ దందాను ప్రోత్సహిస్తోంది.